నకిలీ పాస్‌పోర్టు కేసులో
మహిళ రిమాండ్

21 నకిలీ పాస్‌పోర్టుల జారీకి ఆమె సహకారం

ప్రియుడి పరిచయంతో కటకటాల్లోకి యువతి

2 రోజుల కస్టడీ కోరుతూ సీఐడీ పిటిషన్ దాఖలు

నాంపల్లి కోర్టులు, మే 23 (నమస్తే తెలంగాణ): నకిలీ పాస్‌పోర్టు కేసులో సీఐడీ దూకుడు పెంచింది. మద్రాసు హైకోర్టు ఎదురుగా ఉన్న మ్యాట్ ఎంటర్‌ప్రైజెస్‌లో సేల్స్ అడ్మిన్‌గా పనిచేస్తున్న ప్రియా ధర్మలింగం అనే మహిళను ఈ కేసులో 27వ నిందితురాలిగా చేర్చి, అరెస్టు చేశారు. ఆమెను రెండు రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ గురువారం సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న నిందితురాలికి అధికారులు నోటీసులు జారీ చేశారు. పేరియస్వామితో 2020లో ప్రియకు పెళ్లి జరిగింది. చెన్నైలో వీరిద్దరు మూడేండ్లు కలిసి జీవనం సాగించారు. ఇద్దరి మధ్య ఏర్పడిన తగాదాల నేపథ్యంలో గతేడాదిగా భర్తకు దూరంగా ఉంటున్న ప్రియకు మోహన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం పెళ్లి వరకు వెళ్లినా, అనివార్య కారణాల వల్ల పెళ్లి జరగలేదు. మోహన్‌కు ఏజెంట్లతో ఉన్న పరిచయాల గురించి ఫోన్ ద్వారా ప్రియకు చేరవేశాడు. శ్రీలంకకు చెందిన వారి వివరాలను ప్రియకు అందించాడు. మోహన్ నెథర్‌ల్యాండ్‌లో ఉంటూనే ఫోన్‌ద్వారా ఏజెంట్ మురళి, గ్జేవియర్ నంబర్లను ప్రియకు అందజేయడంతో ఈ వ్యవహారాన్ని ఆమె నడిపింది. ఈ పరిచయం ప్రియను కటకటాల్లోకి నెట్టింది. ఆమెను సీఐడీ అధికారులు చెన్నైలో అరెస్టు చేసి, 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చగా.. 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. మోహన్‌తో ఆమెకు ఏర్పడిన పరిచయంతో శ్రీలంకకు చెందిన వారికి నకిలీ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను మురళి (ఏ13), జాన్ గ్జేవియర్ (ఏ19) సహాయంతో తయారు చేయించి, పాస్‌పోర్టులకు దరఖాస్తు చేసింది. శ్రీలంక జాతీయులైన 21 మందికి నకిలీ భారత పాస్‌పోర్టులను రూపొందించి, వారికి అందజేసింది. నకిలీ పాస్‌పోర్టుల తయారీ కోసం మురళికి ఆన్‌లైన్ ద్వారా డబ్బులను పంపించినట్టు సీఐడీ విచారణలో వెల్లడైనట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆమె నుంచి మరింత సమాచారాన్ని సేకరించాల్సి ఉన్నదని కోరారు. ఆమెను విచారిస్తే శ్రీలంకకు చెందిన జాతీయులు ఎంతమంది ఏజెంట్లను సంప్రదించారో అన్న విషయం తెలుస్తుందన్నారు. సమయం సరిపోకపోవడంతో ప్రియను పూర్తి స్థాయిలో విచారించలేకపోయామన్నారు.

మరణించినా.. జీవించాడు

బండెల ఐలయ్య (ఫైల్)

ఖైరతాబాద్, మే 23 : తాను మరణించినా.. నలుగురికి అవయవదానం చేసి జీవించాడు. రామగుండం పరశురాంనగర్‌కు చెందిన బండెల ఐలయ్య (46) ప్రైవేట్ ఉద్యోగి. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న ఇంట్లో అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానలో చేర్పించినా ఫలితం లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు బుధవారం బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా.. కుటుంబ సభ్యులు అంగీకరించారు. కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను సేకరించారు.

పెట్టుబడి రెట్టింపు చేసి
ఇస్తామంటూ మోసం

జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ఎండీతో సహా ముగ్గురిపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్, మే 23: పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభం ఇస్తామంటూ నమ్మించి రూ.1.2 కోట్లను తీసుకుని మోసం చేసిన నిర్మాణ సంస్థపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి సమీపంలోని హైదర్‌నగర్‌కు చెందిన సునీత, వనమాలకు రెండేళ్ల కిందట జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెటింగ్ డైరెక్టర్ శిల్ప ద్వారా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, అతడి భార్య జి.పద్మజ పరిచయమయ్యారు. నారాయణపేట సమీపంలోని ఫార్మ్ ల్యాండ్స్ వెంచర్‌లో పెట్టుబడి పెడితే.. రెండేండ్లలో రెట్టింపు లాభం ఇస్తామని నమ్మబలికారు. దీంతో వారిద్దరూ కలిసి రూ.1.20 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. ఈ పెట్టుబడికి గ్యారెంటీగా ఆరు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చారు. అయితే, రెండేండ్ల గడువు పూర్తయినా.. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పాటు కనీసం ఫోన్లు కూడా ఎత్తడం లేదు. దీంతో వారి గురించి వాకబు చేసేందుకు ఇటీవల జూబ్లీహిల్స్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్లి చూడగా.. శ్రీనివాస్‌రావు, పద్మజ, శిల్ప పరారీలో ఉన్నారని తేలిసింది. తమను నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు సునీత కుమారుడు పవన్‌కుమార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కోకాపేటలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణాల కూల్చివేతలు షురూ

'నమస్తే' కథనానికి స్పందన

అదనపు అంతస్తులు నిర్మిస్తే కూల్చి వేస్తాం

ఎప్పటికైనా అవి అక్రమ నిర్మాణాలే

నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి

మణికొండ, మే 23: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో 250 గజాల స్థలాల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాల కూల్చివేతలను హెచ్‌ఎండీఏ, టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం చేపట్టారు. ఈ నెల 18న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన '250 గజాల్లో 9 అంతస్తులు' కథనానికి హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీచేసినా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇటీవల నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన కథనానికి స్పందించి తాము కూల్చివేతలు చేపట్టామన్నారు. మున్సిపాలిటీ నుంచి పొందిన అనుమతులను అతిక్రమించి ఒక్కోచోట జీ ప్లస్ 7, 8, 9 అంతస్తుల నిర్మాణాలను కేవలం 250 గజాల స్థలంలోనే నిర్మించారని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టామని, త్వరలోనే అక్రమ నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోకాపేటలోని 250 గజాల స్థలాల్లో (గోల్డెన్ మైల్ కాలనీ) దాదాపు 30కి పైగానే అక్రమ నిర్మాణాలను గుర్తించామన్నారు. మొదటి రోజు ఒక భవనంలోని అదనపు అంతస్తులను కూల్చివేయడం జరిగిందన్నారు. మిగతా అక్రమ నిర్మాణాలను రోజువారీగా కూల్చివేసే ప్రక్రియను చేపట్టామన్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారిణి హారిక, హెచ్‌ఎండీఏ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీపీ తరుణ్ జోషి

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు – 2023 అమలులోకి తేనున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. ఇందులో భాగంగా సిబ్బందికి అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాన్ని న్యాయ నిపుణులతో నిర్వహించారు. మాజీ పీపీ రాములు నూతన చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ, అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలతో శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తోందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కొరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైనర్‌తో వివాహం.. నిందితుడి అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి

సుల్తాన్‌బజార్, మే 23: బాలికను కిడ్నాప్ చేసి, వివాహం చేసుకున్న ఓ ప్రబుద్ధుడు కటకటాల పాలయ్యాడు. ఈ మేరకు పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన హరికృష్ణ (30) సెంట్రింగ్ కార్మికుడు. మూడేండ్ల కిందట అతడికి వివాహమైంది. పలు కారణాలతో అతడికి భార్యతో గొడవ జరిగి విడాకుల వరకు వెళ్లింది. విడాకుల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా.. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో హరికృష్ణకు పరిచయం ఏర్పడింది. ఆ బాలిక బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 11వ తేదీన ఆ బాలిక తన తోటి స్నేహితులతో కలిసి భోజనం చేసేందుకు ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌కు వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న హరికృష్ణ ఆ బాలికను మాయ మాటలతో మభ్యపెట్టి సుల్తాన్‌బజార్ మెట్రో స్టేషన్ వద్ద నుంచి కిడ్నాప్ చేసి, విజయవాడకు తీసుకువెళ్లాడు. బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు కంగారుపడ్డారు. బాలిక స్నేహితులతో విషయం తెలుసుకొని ఈ నెల 13వ తేదీన తమ కూతురు కనిపించడం లేదంటూ సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తొలుత ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. బాలిక బుధవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి హరికృష్ణ తనను కిడ్నాప్ చేసి, వివాహం చేసుకున్నట్లు వాంగ్మూలమిచ్చింది. దీంతో పోలీసులు గురువారం తెల్లవారుజామున హరికృష్ణను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో అతడు బాలికను కిడ్నాప్ చేసి, విజయవాడకు తీసుకువెళ్లి 16న హనుమాన్ మంది రంలో వివాహం చేసుకోవడంతో పాటు ఓ లాడ్జిలో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపాడు. దీంతో హరికృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నేరానికి ఉపయోగించిన సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. నిందితుడికి నేరచరిత్ర ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

నేను మైనర్‌ను కాదు, మేజర్‌ని..

ఈ నెల 22న సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాలిక.. తాను మైనర్‌ను కాదని, మేజర్‌ను అని పోలీసులకు తెలిపింది. తన పదో తరగతి సర్టిఫికెట్‌ను చూపించింది. ఆ సర్టిఫికెట్‌లో తప్పుగా పుట్టిన తేదీ పడిందని, పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో బాలిక జన్మించిన పత్రాలను తల్లి ఇవ్వడంతో సుల్తాన్‌బజార్ పోలీసులు వివరాలను సేకరించారు. ఆస్పత్రి పత్రాలతో బాలిక మైనర్‌గా నిర్ధారణకు వచ్చారు. ఆ తర్వాత బాలిక వాంగ్మూలాన్ని రికార్డ్ చేసి.. పేట్ హోంకు తరలించారు. నిందితుడు హరికృష్ణపై కిడ్నాప్, పోక్సో చట్టాల కింద పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువైతే 20 ఏండ్ల శిక్షపడే అవకాశం ఉన్నదని ఏసీపీ స్పష్టం చేశారు.

ఏసీపీ ఉమామహేశ్వరరావు చిట్టా పెద్దదే!

ఆస్తుల వివరాలు వెల్లడించిన ఏసీబీ

నాంపల్లి కోర్టులు, మే 23 (నమస్తే తెలంగాణ): సీసీఎస్‌లో ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తమరాణ శ్రీరామ ఉమా మహేశ్వరరావు పేరిట ఉన్న ఆస్తుల వివరాలను ఏసీబీ అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్టు సమాచారం మేరకు దాడులు నిర్వహించగా.. కీలక పత్రాలను, డబ్బును, బంగారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత ఏసీబీ అధికారి ఎం.మల్లిఖార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టం 13 (10 (బి) రెడ్‌విత్ 13 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కస్టడీ కోసం అధికారులు పిటిషన్‌ను సిద్ధం చేస్తున్నారు. మొత్తం రూ.3 కోట్ల 51 లక్షల 83 వేలకు చెందిన డాక్యుమెంట్లను అధికారులు జప్తు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులను సేకరిస్తున్నారు.

ఆస్తుల వివరాలు ..

- ఆంధ్రప్రదేశ్‌లోని చౌడవరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వే నంబర్ 209లో 5.92 ఎకరాల వ్యవసాయ భూమిని తన పేరు మీద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలు సేకరించారు. దీని విలువ 32 లక్షల 56వేలు.
- దొండపూడి గ్రామం, చౌడవరం, విశాఖ జిల్లాలో 2.20 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, తన పేరిట రిజిస్టర్ అయ్యింది. దీని విలువ 12 లక్షల 10 వేలు.
- శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో సర్వే నంబర్ 530లో ఒక ఎకర భూమిని 72 లక్షల 50 వేలకు కొన్నారు.
- తన మామ కొంతంబాక సతీశ్ పేరు మీద ఘణపూర్ గ్రామం ఘట్‌కేసర్ మండలంలో ప్లాటును 37 లక్షల 54 వేలకు కొన్నారు.
- ఆర్.ఎస్.కన్‌స్ట్రక్షన్స్‌లో 2022లో 50 లక్షలతో 333 చదరపు గజాల విల్లాను శామీర్‌పేట మండలంలో కొనుగోలు చేశాడు.
- అశోక్‌నగర్‌లో ఓర్‌నాట అపార్టుమెంట్‌లోని రెండో అంతస్తులో ఫ్లాటును 55 లక్షలకు కొనుగోలు చేశాడు.
- కూకట్‌పల్లి గ్రామంలో 200 గజాల ప్లాటును 30 లక్షలకు.. ఇంకా మరి కొన్ని చోట్ల ప్లాట్లను కొనుగోలు చేసినట్టు అధికారులు ఆధారాలను సేకరించారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలు సీజ్

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సెల్లింగ్ ప్రైజ్ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అధికారులు సీజ్ చేశారు. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని బీరంగూడ అమీన్‌పూర్‌లో 5గ్రాముల 'వాసిఫిన్-ఓ' అయింట్‌మెంట్ ధరను అన్ని రకాల పన్నులతో కలిపి రూ.113.6కు విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, అందుకు విరుద్ధంగా తయారీ కంపెనీ 5 గ్రాముల అయింట్‌మెంట్ ట్యూబ్‌ను నిర్ణీత ధర కంటే రూ.26.40లకు అధికంగా రూ.140లకు విక్రయిస్తుంది. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు మేడ్చల్‌లోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి.. అధిక ధరలకు విక్రయించే 'వాసిఫిన్-ఓ' ఔషధాలను సీజ్ చేశారు. అనంతరం తయారీ ఫార్మా కంపెనీ 'డెర్మిడర్మ్ బయోటెక్' ప్రై.లి. కంపెనీకి నోటీసులు జారీ చేశారు. కాగా, సంగారెడ్డి జిల్లా పరిధిలో 'ఇట్రొకాప్-200' క్యాప్సుల్స్‌కు సంబంధించి 10 మాత్రల షీట్‌ను రూ.285లకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. కానీ, తయారీ కంపెనీ అందుకు విరుద్ధంగా నిర్ణీత ధర కంటే రూ.37.3 అధిక ధరకు విక్రయిస్తోంది. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు జిల్లా పరిధిలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపి.. అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలను సీజ్ చేశారు. అనంతరం తయారీ కంపెనీ 'జనిత్ డ్రగ్స్ ప్రై.లి.'కు నోటీసులు జారీచేశారు.

ఫెరోజ్ ఫ్రిమ్రోజ్ సంస్థపై కేసు!

కుత్బుల్లాపూర్, మే 23: సైఫాబాద్ పీఎస్ పరిధిలో వెలుగులోకి వచ్చిన ఫెరోజ్ ఫ్రిమ్రోజ్ కరెన్సీ నోట్ల ఎక్స్చేంజ్ సంస్థ చేసిన మోసంపై నమోదైన కేసును విచారణలో భాగంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సమాచారం. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వల్లభ్‌భాయ్‌పటేల్‌నగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి తన సోదరుడు మహేందర్‌రెడ్డి యూకే యూనివర్సిటీలో ఫీజును చెల్లించేందుకు నగరంలోని బషీర్‌బాగ్ బాబూఖాన్ ఎస్టేట్‌లో ఉన్న ఫెరోజ్‌ఫ్రిమ్రోజ్ కరెన్సీనోట్ల ఎక్స్చేంజ్ సంస్థను గతేడాది సెప్టెంబర్‌లో ఆశ్రయించారు. సంస్థ మేనేజర్ రాజు తన ఖాతాలో రూ.3 లక్షలు డిపాజిట్ చేయించుకున్నాడు. ఆ తర్వాత సాంకేతిక సమస్య ఉన్నదని క్రెడిట్ కార్డు ద్వారా పేమెంట్ చేయాలని నమ్మించి మరో రూ.7 లక్షలు తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. ఆ డబ్బులు యూకే యూనివర్సిటీకి బదిలీ కాకపోవడం, కేవలం మేనేజర్ రాజు ఖాతాకే బదిలీ అవ్వడంతో ఆందోళన చెందారు. సాంకేతిక సమస్య తలెత్తిందని, త్వరలోనే తిరిగి మీ ఖాతాకు డబ్బులు బదిలీ చేస్తానని నమ్మించి మోసం చేశాడు. దీంతో బాధితులు సైఫాబాద్‌లో ఫిర్యాదు చేశారు. అయితే దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఈ కేసును జీడిమెట్ల పీఎస్‌కు బదిలీ చేసినట్టు సమాచారం. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావును వివరణ కోరగా.. ఫిర్యాదు దారులను సంప్రదించాలంటూ సమాధానమివ్వడం గమనార్హం.

వర్క్ ఫ్రం హోమ్ పేరుతో బురిడీ

బంజారాహిల్స్, మే 23: ఇంట్లోనే ఉంటూ ఆన్‌లైన్ ద్వారా భారీగా డబ్బులు సంపాదించవచ్చంటూ యువతిని నమ్మించి మోసం చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరికి చెందిన కె.శ్రీవల్లికి ఆరునెలల కిందట ఓ మెసేజ్ వచ్చింది. వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. దీంతో ఆ మెసేజ్‌లోని లింక్ ద్వారా ఆమె తన పేరును రిజిస్టర్ చేసుకుంది. ఇచ్చిన టాస్క్‌లు పూర్తిచేస్తూ కొంత పెట్టుబడితో నాలుగు నెలల్లో రూ.10 వేలు వరకు శ్రీవల్లి సంపాదించింది. దీంతో మరింత ఎక్కువ మొత్తంలో ఆదాయం రావాలంటే రూ.92వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని చెప్పడంతో.. ఆ మొత్తాన్ని పలు దఫాలుగా పంపించింది. డబ్బులు పంపించగానే యాప్ బ్లాక్ చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డబ్బులు పంపినట్లు నటించి..

బంజారాహిల్స్, మే 23: బ్యాంకులో క్యాష్ డిపాజిట్ చేసేందుకు వెళ్లిన వ్యక్తిని బురిడీ కొట్టించి, నగదును కాజేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్ నివాసి జి.రాజు డ్రైవర్. ఈ నెల 22న జూబ్లీహిల్స్ రోడ్ నం.45లోని ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎంకు వెళ్లాడు. అక్కడున్న క్యాష్ డిపాజిట్ మిషన్‌లో రూ.35వేలు డిపాజిట్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా మిషన్ పనిచేయడం లేదని సిబ్బంది చెప్పారు. బ్యాంకులో డిపాజిట్ వేసేందుకు టైమ్ లేక పోవడంతో.. ఏం చేద్దామని ఆలోచిస్తున్న రాజు వద్దకు ఓ వ్యక్తి వచ్చాడు. తనకు అర్జెంట్‌గా క్యాష్ కావాలని, నీ వద్దనున్న క్యాష్ ఇస్తే అకౌంట్‌లోకి డబ్బులు పంపిస్తానంటూ నమ్మబలికాడు. అప్పటికే డ్యూటీకి ఆలస్యం కావడంతో గుర్తుతెలియని వ్యక్తికి రూ.35వేలు ఇచ్చాడు. క్షణాల్లోనే రూ.35 వేలు రాజు అకౌంట్‌లోకి వచ్చినట్లు ఆయన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో తన అకౌంట్‌లోకి డబ్బులు వచ్చాయని భావించిన రాజు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత రాజు అకౌంట్‌ను చెక్ చేసుకోగా.. డబ్బులు రాలేదు. దీంతో వెంటనే బ్యాంక్ వద్దకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తి కనిపించలేదు. తప్పుడు మెసేజ్ ద్వారా బురిడీ కొట్టించి, రూ.35వేలు కాజేసినట్లు గుర్తించిన బాధితుడు రాజు గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 420, 379 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కాపీరైట్ చట్టం ఉల్లంఘన

బాబిలోన్, అమ్మేషియా పబ్స్‌పై కేసులు

బంజారాహిల్స్, మే 23: కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిర్ధేషిత ఫీజులు చెల్లించకుండా మ్యూజిక్ ప్లే చేస్తున్న పబ్స్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఫోనోగ్రాఫిక్ పర్‌ఫార్మెన్స్ లిమిటెడ్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌లోని రెండు పబ్స్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ముంబైలోని ఫోనోగ్రాఫిక్ పర్ఫార్మెన్స్ లిమిటెడ్ అనే సంస్థకు హిందీ, తెలుగు, ఇంగ్లిషుతో పాటు అనేక భాషలకు సంబంధించిన పాటలు, సంగీతంపై కాపీరైట్ ఉన్నాయి. ఆయా సంగీతాన్ని ఉపయోగించుకోవాలంటే నిర్ణయించిన మొత్తాన్ని సదరు సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, తమ సంస్థకు ఎలాంటి రుసుము చెల్లించకుండానే జూబ్లీహిల్స్‌లోని బాబిలోన్ పబ్, అమ్మేషియా పబ్స్‌లో తాము కాపీరైట్ కలిగిన సంగీతాన్ని ప్లే చేస్తున్నారంటూ సంస్థ ప్రతినిధులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనే ఈ పబ్స్ నిర్వాహకులకు తాము లీగల్ నోటీసులు పంపించామని, అయినప్పటికీ యథావిధిగా కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారంటూ సంస్థ ప్రతినిధులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బాబిలోన్ పబ్ నిర్వాహకులు కుమార్‌లాల్, సుశీల్ అగస్టీన్, నీరజ్ మలానీ, మెరీన్ బాబు, బిందియా జావర్‌తో పాటు అమ్మేషియా పబ్ నిర్వాహకులు రాజశేఖర్ రామనాథం, కునాల్ కుర్రేజాలపై ఐపీసీ 420, 406 తో పాటు కాపీరైట్ చట్టంలోని 53-ఏ, 63, 69ల కింద వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PACKERS & MOVERS



★ Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-334207

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ. న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-334110

GOLD FINANCE



★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-328144

OLD AGE HOME



★వృద్ధులు & భార్యాభర్తలు A/c & N/C అటాచ్డ్ బాత్‌రూం, మేడిపల్లి/ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. Ph: 7981467036, 9391039990, 9515474083. NT-327838

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 07/07 - అమరనాథ్ + నవదేవి యాత్ర; ★20/09 - చార్‌ధామ్ యాత్ర; ★కార్తీకం 06/11 - కాశీ యాత్ర @ 9908844377. NT-334106

PLOT FOR SALE

★6,50,000/- రూ.లకే 242 చ.గ।। 2 గుంటల ఫామ్ ల్యాండ్. పండ్లవెట్లు, కూరగాయలు, ఆకుకూరల పెంపకం. 5 సం।।